

ఆర్‌డిఒగా అచ్యుత్ అంబరీష్ బాధ్యతలు స్వీకరణ



నరసాపురం టౌన్:నరసాపురం ఆర్‌డిఒగా విశాఖపట్నానికి చెందిన అచ్యుత్ అంబరీష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన పాడేరు ఆసుపత్రిలో వైద్యునిగా మూడేళ్లపాటు వైద్య సేవలు అందించారు. అనంతరం గ్రూప్-1లో ఎంపికై శిక్షణకాలంలో శిక్షణ పూర్తి చేసుకుని నరసాపురం ఆర్‌డిఒగా ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. నర్సాపురం సబ్ కలెక్టర్‌గా పని చేసిన ఎం.సూర్యతేజ బదిలీపై కెఆర్‌పురం ఐటిడిఎ పిఒగా వెళ్లిన తర్వాత నుంచి ఇన్‌ఛార్జి ఆర్‌డిఒగా డిఆర్‌ఒ కృష్ణవేణి వ్యవహరిస్తున్న విషయం తెలిసిందే. నరసాపురం ఆర్‌డిఒగా బాధ్యతలు స్వీకరించిన అచ్యుత్ అంబరీష్‌కు ఆర్‌డిఒ కార్యాలయ ఎఒ వెంకటేశ్వరరావు, డివిజన్లోని తహశీల్దార్లు ఫాజిల్, అనితకుమారి, కృష్ణారావు, సుబ్రహ్మణ్యం, పెద్దిరాజు, సునీల్‌కుమార్, మూర్తి, అశోక్‌వర్మ, రెవెన్యూ అధికారులు విజయ్, నాగలత, యశోద, జ్యోతి, సురేశ్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

బీమా ఉన్నట్టా.. లేనట్టా..!

వర్షాల్లేక వేలాది ఎకరాల్లో పంట నష్టం
చింతలపూడి, చాట్రాయి మండలాల్లో పరిస్థితి దారుణం
నీరు లేక ఎక్కడికక్కడే ఎండిపోయిన వరిపంట
బీమా ప్రీమియం చెల్లింపుపై వీడని గందరగోళం
పంటనష్టం అంచనాలు కదిలేదెప్పుడో
కన్నీరుమున్నీరవుతున్న అన్నదాత

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి


ఈ ఏడాది దెబ్బతిన్న పంటలకు బీమా వర్తిస్తుందా.. లేదా అనే అనుమానాలు అన్నదాతను వెంటాడుతున్నాయి. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఇప్పటికే జిల్లాలో వేలాది ఎకరాల్లో వరి పంట దెబ్బతినంగా, పత్తి పంటసైతం దెబ్బతినే దశకు చేరుతోంది. దెబ్బతిన్న పంటలకు సంబంధించి పంట నష్టపరిహారం, బీమా అందుతాయో, లేదో అనే భయం రైతులను పట్టిపీడిస్తోంది. వైసిపి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఉచిత పంటల బీమా పథకం ప్రభుత్వ ఆధ్వర్యంలోనే సాగింది. దెబ్బతిన్న పంటలకు సంబంధించి ప్రతియేటా బీమా సొమ్ము అందించడం జరుగుతోంది. ఈసారి పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. కేంద్ర ప్రభుత్వ ఒత్తిడితో ప్రభుత్వం బీమా నుంచి తప్పుకుని ప్రధానమంత్రి పసలబీమా పథకాన్ని మార్చి ప్రయివేటు కంపెనీలకు అప్పగించింది. రైతులకు సంబంధించిన బీమా ప్రీమియం ప్రభుత్వమే బీమా కంపెనీలకు చెల్లిస్తుందని చెప్పింది. ఇప్పటి వరకూ బీమా ప్రీమియం ప్రభుత్వం చెల్లించిందా.. లేదా అనే ప్రశ్నకు సమాధానం ఏఒక్కరూ చెప్పడం లేదు. దీంతో దెబ్బతిన్న పంటలకు బీమా అందుతుందో.. లేదో అనే గందరగోళం అందరినీ వెంటాడుతోంది.

వర్షాల్లేక కమ్ముకున్న కరువు

ఈ ఏడాది వర్షాభావ పరిస్థితులతో పలు మండలాల్లో కరవు పరిస్థితులు నెలకొన్నాయి. ఏలూరు జిల్లాలో 2.30 లక్షల ఎకరాల్లో వరి సాగు చేశారు. చింతలపూడి, చాట్రాయి వంటి మండలాల్లో వర్షాభావ పరిస్థితుల కారణంగా పంటలు ఎండిపోతున్న పరిస్థితి ఉంది. ఏజెన్సీలోనూ అదే పరిస్థితి ఉంది. చింతలపూడి మండలంలో 16 వేల ఎకరాల్లో వరిసాగవ్వగా దాదాపు పదివేల ఎకరాల్లో వర్షాధార పంటనే ఉంది. ఇప్పటి వరకూ అధికారుల ప్రాథమిక అంచనాల ప్రకారం 1,098 ఎకరాల్లో వరిపంట దెబ్బతిన్నట్లు తెలిసింది. దెబ్బతిన్న పంట దాదాపు ఐదు వేల ఎకరాలకు చేరవచ్చునని రైతులు చెబుతున్నారు. బోర్లలో నీటిమట్టం రెండు అడుగులు కిందకు పడిపోవడంతో పత్తిపంటకు సైతం ప్రమాదం ఏర్పడినట్లు రైతు ఆందోళన చెందుతున్నాడు. చాట్రాయి మండలంలోనూ వేలాది ఎకరాల్లో వరిపంట దెబ్బతింది. దెబ్బతిన్న పంటలను పశువుల మేతకు రైతులు వదిలేస్తున్నారు. ముసునూరు వంటి మండలాల్లోనూ పరిస్థితి కొంత ఆందోళనకరంగా ఉన్నట్లు చెబుతున్నారు. ఇప్పటికే రైతులు ఎకరాకు రూ.20 వేలకుపైగా పెట్టుబడులు పెట్టిన పరిస్థితి ఉంది. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు. ముఖ్యంగా కౌలురైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ఇక పశ్చిమగోదావరి జిల్లా డెల్టాలో సాగునీరందక పంటలు ఎండిపోతున్నాయి. శివారు ఆయకట్టుకు సాగునీరందక రైతులు తల్లడిల్లుతున్నారు. కాల్వల ఆధునికీకరణ చేపట్టకపోవడం, కనీసం తూడు తొలగింపు పనులు చేపట్టకపోవడం రీత్యా పరిస్థితి దారుణంగా తయారైందని రైతులు వాపోతున్నారు.

ప్రభుత్వంలో చలనం కరువు

దెబ్బతిన్న పంటలపై ప్రభుత్వం నుంచిగాని, అధికారుల నుంచిగాని చలనం లేకుండాపోయింది. దెబ్బతిన్న పంటలకు సంబంధించి అంచనాల తయారీకి సైతం ఎటువంటి ఆదేశాలూ ఇప్పటి వరకూ వెలువడలేదు. మరోపక్క బీమాపై గందరగోళం నెలకొనడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. పంటలు దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం నుంచి ఇప్పటి వరకూ ఎటువంటి భరోసా ప్రకటన వెలువడలేదు. ప్రజాప్రతినిధులు సైతం నోరువిప్పడం లేదు. కరువు ప్రభావం మిగిలిన పంటలపైనా పడే పరిస్థితి కన్పిస్తోంది. ఇ-క్రాప్‌లో నమోదైన పేర్లు ఉన్న రైతులకు మాత్రమే బీమా వర్తిస్తుందని అధికారులు చెబుతున్నారు. ఇ-క్రాప్‌లో నమోదుకాని కౌలురైతుల పరిస్థితి ఏమిటో ప్రభుత్వం తేల్చాల్సి ఉంది. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని అంతా కోరుతున్నారు.



జిల్లాలో నీరందక ఎండిపోయిన వరిపొలం

పంటనష్టం నమోదు ప్రక్రియ చేపట్టాలి

కె.శ్రీనివాస్, ఎపి రైతుసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో దెబ్బతిన్న పంటలకు సంబంధించి నమోదు ప్రక్రియ వెంటనే చేపట్టాలి. వెంటనే పంట నష్టపరిహారం, బీమా పరిహారం అందించాలి. ముఖ్యంగా దెబ్బతిన్న పంటల జాబితాలో కౌలురైతుల పేర్లు నమోదు చేసి ఆదుకోవాలి.



శ్మశానవాటికను పరిశీలిస్తున్న నాయకులు

శ్మశాన భూమి కేటాయింపులో నిర్లక్ష్యం తగదు

వెయ్యిపైనే కుటుంబాలకు 26 సెంట్లేనా
తక్షణం జిఒ నెం.1235 అమలు చేయాలి
కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.క్రాంతిబాబు

ప్రజాశక్తి - గణపవరం

అర్థవరం దళితపేటకు తక్షణం రెండెకరాల భూమిని శ్మశాన వాటికకు కేటాయించాలని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి కె.క్రాంతిబాబు డిమాండ్ చేశారు. బుధవారం అర్థవరంలో దళితపేట శ్మశానవాటికను కెవిపిఎస్ బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా క్రాంతిబాబు మాట్లాడుతూ గణపవరం మండలంలోనే అతిపెద్ద దళితపేటల్లో అర్థవరం దళితపేట ఒకటని అన్నారు. సుమారు 1037 కుటుంబాలు, దాదాపు వేలాది మంది ప్రజలు ఈ దళితపేటలో నివసిస్తున్నారని తెలిపారు. ఉన్న 26 సెంట్ల భూమిని శ్మశానంగా ఉపయోగించుకుంటున్నారన్నారు. ఏళ్ల తరబడి శ్మశానవాటిక కోసం మండల అధికారుల చుట్టూ తిరిగినా కనీసం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఇటీవల జిల్లా స్పందనలో కెవిపిఎస్ ఇచ్చిన ఫిర్యాదుతో మండల అధికారులు గ్రామానికి వచ్చి శ్మశాన వాటికను పరిశీలించారని తెలిపారు. దళితులకు శ్మశాన వాటిక అవసరం ఉందని, అయితే కేటాయింపునకు భూమి లేదని నిర్లక్ష్యపు సమాధానం ఇవ్వడం అన్యాయమని అన్నారు. తక్షణం జిల్లా అధికారులు స్పందించాలని విజ్ఞప్తి చేశారు. ప్రతి దళితపేటకూ రెండెకరాల భూమిని శ్మశాన వాటికకు కేటాయించాలని ఇచ్చిన జిఒ నెం.1235ను తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల కాలంలో దళితులకు శ్మశానాలు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను కూడా అధికారులు పక్కన పెట్టారని మండిపడ్డారు. వెయ్యి కుటుంబాలకుపైగా ఉన్న అర్థవరం దళితపేటకు రెండెకరాల భూమిని కొనుగోలు చేసి తక్షణం శ్మశాన వాటికగా కేటాయించాలని క్రాంతిబాబు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఎవరైనా మృతి చెందితే తహశీల్దార్ కార్యాలయం, గ్రామ సచివాలయం వద్దే ఖననం చేసేలా ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో కెవిపిఎస్ మండల కార్యదర్శి చిన్నం చిననాగేశ్వరరావు, గ్రామ పెద్ద సగలాబత్తుల శామ్యూల్, యువజన నాయకులు చిన్నం నాగపార్థ భవాని సింహ, ఎస్.వంశీ పాల్గొన్నారు.

విశ్వమానవ వేదిక అన్నదానానికి 2900 రోజులు

ప్రజాశక్తి - పాలకొల్లు

అభాగ్య వృద్ధుల ఆకలి తీర్చే విశ్వమానవ వేదిక నిత్యాన్నదానానికి 2,900 రోజులు పూర్తయినట్లు ఆ వేదిక వ్యవస్థాపకులు మల్లుల సురేష్ చెప్పారు. స్థానిక సంస్థ కార్యాలయంలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. కొత్తగా పెచ్చెట్టిపాలెంలో నిత్యాన్నదానం సేవలు ప్రారంభించినట్లు చెప్పారు. ఆదరణ లేని నిరుపేద వృద్ధులు, వికలాంగులు నివసించే ప్రదేశానికే భోజనం అందించే విశ్వమానవవేదిక నిత్యాన్నదానం కార్యక్రమం బుధవారం నాటికి 2,900 రోజులు పూర్తయిందన్నారు. 2015 నవంబర్ 17న పాలకొల్లు పట్టణంలో ఆదరణలేని వద్ధులు, యాచకులు నివసించే ప్రదేశానికే భోజనం తీసుకెళ్లే నిత్యాన్నదానం సేవలు ప్రారంభించి, అంచెలంచెలుగా పోడూరు మండలంలోని వేడంగి, వేడంగిపాలెం, కుమ్మరిపాలెం, కొమ్ముచిక్కాల, జిన్నూరుపాలెం గ్రామాలతోపాటు పాలకొల్లు మండలంలోని వడ్లవానిపాలెం గ్రామాలకు సేవలు విస్తరించామని చెప్పారు. విశ్వమానవవేదిక నిత్యాన్నదానం అమలవుతున్న ప్రాంతాల్లో ఎవరైనా అనాధ వృద్ధులు, వికలాంగులు భోజనానికి ఇబ్బంది పడుతుంటే 9652256999 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సురేష్ కోరారు. ఈ కార్యక్రమంలో వేదిక సభ్యులు గుంపుల రవి, డాక్టర్ మల్లుల జ్ఞానేశ్వరి, నడపన సత్యనారాయణ, వేంద్ర కిట్టూ తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు గుండె ఉచిత వైద్య పరీక్షలు

ప్రజాశక్తి - భీమవరం రూరల్

పిల్లల గుండె సంబంధిత వ్యాధులకు ఉచిత వైద్యశిబిరాన్ని స్థానిక అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ వైద్య సహాయ కేంద్రం (సుందరయ్య భవనం)లో బుధవారం నిర్వహించారు. విజయవాడ ఆంధ్రా హాస్పిటల్‌కు చెందిన పిల్లల గుండె వైద్య నిపుణులు డాక్టర్ కె.విక్రమ్ (ఇంటర్‌వెన్షనల్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్) 15 సంవత్సరాల్లోపు వయస్సున్న పిల్లలను పరిశీలించి, 2డి ఎకో పరీక్షలు నిర్వహించి వైద్య సేవలందించారు. వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు మాట్లాడుతూ ఎబిఎస్‌వికె వైద్య సహాయ కేంద్రానికి సహకారం అందిస్తున్న వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకటరామరాజు, కార్యదర్శి మంతెన కృష్ణంరాజు, ఎస్ఎల్‌జి హాస్పిటల్స్ (హైదరాబాద్) అధినేత దండు శివరామరాజు, సేవాకేంద్రం ట్రస్టీ బి.బలరాం, వైద్య సేవలందించిన డాక్టర్ విక్రమ్‌ను అభినందించారు.

2.23 లక్షల ఎకరాల్లో ఇ-క్రాప్ నమోదు


ప్రజాశక్తి - భీమవరం

జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో 2,30,052 ఎకరాల్లో ఇ-క్రాప్ పూర్తిచేశామని వ్యవసాయ శాఖ జెడి జెడ్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో అన్ని గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల వద్ద ఈ నెల 26వ తేదీ నుండి 29 వరకూ క్రాప్ ముసాయిదా జాబితాను సామజిక తనిఖీ కోసం ప్రచురిస్తామని తెలిపారు. అలాగే గ్రామసభలు కూడా నిర్వహించనున్నామని పేర్కొన్నారు. ఈ గ్రామసభల్లో రైతు భరోసా కేంద్రాల సిబ్బంది ముసాయిదా జాబితాలో ఉన్న రైతుల ఇ-క్రాప్ నమోదులో 'ఉన్న అన్ని వివరాలను సమగ్రంగా చదివి వినిపిస్తారని తెలిపారు. అభ్యంతరాలుంటే రాతపూర్వకంగా తెలియజేయాలన్నారు.

వికలాంగుల సంక్షేమానికి కృషి : కారుమూరి

ప్రజాశక్తి - తణుకు

వికలాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరావు అన్నారు. బుధవారం తణుకు పురపాలక సంఘం కార్యాలయ ప్రాంగణంలో వికలాంగులకు మూడు చక్రాల మోటర్ సైకిల్‌ను మంత్రి కారుమూరి, కలెక్టర్ ప్రశాంతి అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వికలాంగుల పట్ల జాలి చూపడం కాదని వారికి ప్రేమ ఆప్యాయతలు పంచాలన్నారు. విద్య, వైద్యం, ఉద్యోగం, ఉపాధి అవకాశాలతో పాటు ఎంతో ఖరీదైన ఉపకారణాలను ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ఒక్కొక్క వాహనం ఖరీదు రూ.1.20 లక్షలు అని మొత్తం రూ.12 లక్షలు ప్రభుత్వ సహాయం అందించడం మంచి పరిణామమన్నారు. ఈ వాహనాలను వికలాంగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకుని భవిష్యత్తులో మంచి స్థానాల్లో స్థిరపడి సుఖ సంతోషాలతో జీవించాన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఒ చెన్నయ్య మున్సిపల్ కమిషనర్ సుధాకర్, వికలాంగుల సహాయ సంచాలకులు సిహెచ్.ప్రభాకర్ పాల్గొన్నారు.



వికలాంగులకు వాహనాలు అందిస్తున్న కారుమూరి

30న భీమవరంలో రైతు రాష్ట్ర సదస్సు

ఎపి రైతుసంఘం ఆధ్వర్యాన గ్రామాల్లో విస్తృత ప్రచారం

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

రైతును నిలబెట్టాలి, వ్యవసాయాన్ని కాపాడాలి, వ్యవసాయ ఆక్వారంగ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 30న మధ్యాహ్నం రెండు గంటలకు భీమవరం టౌన్ రైల్వేస్టేషన్ వద్ద గల రైస్‌మిల్లర్స్ హాల్లో రాష్ట్ర సదస్సును రైతులందరూ పాల్గొని జయప్రదం చేయాలంటూ పలు గ్రామాల్లో ఎపి రైతుసంఘం ఆధ్వర్యాన బుధవారం ప్రచారం నిర్వహించారు. తొలుత లక్ష్మణేశ్వరంలో సదస్సు కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరాం మాట్లాడుతూ సదస్సుకు రాష్ట్ర నాయకులు, వ్యవసాయ శాస్త్రవేత్తలు విచ్చేస్తారని తెలిపారు. అనంతరం వేములదీవి, దర్భరేవు, మర్రితిప్ప, సీతారామపురం తదితర గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారం చేశారు. కార్యక్రమంలో గుత్తుల శ్రీరామచంద్రుడు, కడలి నాగరాజు, యాండ్ర సత్యనారాయణ, ముత్యాల హరినాథ్, చాగంటి రామాంజనేయులు, కె.శ్రీరామ్మూర్తి, సెగండి మస్తాన్ పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న నాయకులు

మహనీయులు వంకా సత్యనారాయణ

ప్రజాశక్తి - తణుకు

ప్రజా ఉద్యమాల కోసం నిరంతరం తపించిన మహనీయుడు మాజీ ఎంఎల్ఎ వంక సత్యనారాయణ అని సిపిఎం జిల్లా కార్యదర్శి బి.బలరాం అన్నారు. బుధవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ఎమ్మెల్యే వంక సత్యనారాయణ ఐదో వర్ధంతి సభ సిపిఐ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సభకు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అధ్యక్షత వహించగా బలరాం మాట్లాడుతూ అట్టడుగు వర్గాల అభివృద్ధికి సత్యనారాయణ తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. ప్రజా సమస్యలను అసెంబ్లీలో తన కంఠంతో వినిపించిన మహా నాయకుడు వంక అని అన్నారు. వామపక్ష ఉద్యమ బలోపేతానికి నిరంతరం కృషి చేసేవారన్నారు. సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ అటవీ, బంజర భూములను పేదలకు పంచిపెట్టి భూపోరాట యోధుడిగా నిలిచారన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా మూడు పర్యాయాలు పని చేశారన్నారు. జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుండి స్వాతంత్ర పోరాట స్ఫూర్తిని వంక అలవర్చుకున్నారన్నారు. ఈ సభలో ఎంఎల్‌సి వంక రవీంద్రనాథ్, మాజీ మున్సిపల్ ఛైర్‌పర్సన్ వంక రాజకుమారి, డాక్టర్ రామదాసు, వద్దని నాగరాజు, రైతుసంఘం నాయకులు పోగలపూడి వీర రాఘవులు, సిపిఐ నాయకులు నెక్కంటి సుబ్బారావు, బండి వెంకటేశ్వరరావు, సికిలే పుష్పకుమారి తదితరులు మాట్లాడారు. తొలుత వంక చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



మాట్లాడుతున్న బలరాం

పిల్లలకు కళారూపాల్లో శిక్షణకు కళావేదిక : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు, సంస్కృతిని తెలియజెప్పేందుకు వివిధ కళారూపాల్లో శిక్షణ అందించే దిశగా ఒక కళావేదికను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో అల్లూరి సీతారామరాజు యువజన సమాఖ్య సంస్థ ఆధ్వర్యంలో వివిధ సాంస్కృతిక కళాకారులు, సంస్థల నిర్వాహకులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు స్కూల్‌కు వెళ్లేముందు, వచ్చిన తర్వాత ఏదోక సమయంలో ఉదయం, సాయంత్రం రెండు గంటలు వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగస్వాములను చేసినట్లయితే మన సంస్కృతీ సంప్రదాయాలను భవిష్యత్ తరాలకు అందించిన వారమవుతామన్నారు. ప్రస్తుత ఆధునిక కాలంలో పిల్లలు సాంకేతిక పరికరాలకు ఎక్కువగా ఆకర్షితులై సాంస్కృతిక కళలను తెలుసుకోవడం లేదని, ముందు తరాలకు ప్రాంతీయ సంస్కృతీ, కళలు, సంప్రదాయాలు అలవాటు చేయాలని ఆమె అన్నారు. అందుకోసం ఒక కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో ఆసక్తి కనబరిచిన పిల్లలకు ప్రయోజనం చేకూరేలా సాంస్కృతిక కళలు, నాట్యం, సంగీతం, కరాటే, కర్రసాము, కబడ్డీ, యోగా, హస్తకళలు తదితర కార్యక్రమాల్లో భాగస్వాములను చేయాలని ఆమె అన్నారు. దీనికోసం తొలుత రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకుని ఆసక్తి కలిగిన కళల్లో నైపుణ్యం పొందుతారన్నారు. ముందుగా అనువైన భవనాన్ని ఏర్పాటు చేయాలని భీమవరం మున్సిపల్ కమిషనర్‌ను ఆదేశించారు. ఈ కార్యక్రమంపై పిల్లలకు, పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించేందుకు డిఇఒ ప్రత్యేక శ్రద్ధ కనబర్చాలన్నారు. జిల్లా సమాచార శాఖ అధికారి ఈ కమిటీకి కన్వీనర్‌గా వ్యవహరిస్తారని, వారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం కొనసాగుతుందని ఆమె స్పష్టం చేశారు. పైలెట్ ప్రాజెక్టుగా తొలుత భీమవరం మున్సిపాల్టీలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని, అనంతరం జిల్లాలోని అన్ని మున్సిపాల్టీల్లో ఏర్పాటు చేస్తామని వివరించారు. ఈ కళా వేదికకు 'భీమవరం సాంస్కృతిక కళావేదిక'గా నామకరణం చేయాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సంబంధిత అధికారులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, కళాకారులు సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, డిఇఒ ఆర్.వెంకటరమణ, డిపిఆర్ఒ టి.నాగేశ్వరరావు, అల్లూరి సీతారామరాజు యువజన సమాఖ్య జిల్లా అధ్యక్షులు కంతేటి వెంకట్రాజు, సంఘ సేవకులు చెరుకువాడ రంగసాయి, లయన్స్ క్లబ్ జోన్స్ ఛైర్మన్ నందమూరి రాజేష్, కళారంజని నాటక అకాడమీ జవ్వాది దాసర శ్రీనివాస్, గురజాడ కళానికేతన్ నిర్వాహకులు చుక్కనశ్రీ, ప్రజానాట్యమండలి ఎస్‌కె.చాన్‌భాషా, ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ కల్చరల్ యూనిక్ ఆర్ట్స్ అండ్ సర్వీసెస్ జి.మల్లేశ్వరరావు, పశ్చిమగోదావరి జిల్లా పతాంజలి యోగ అసోసియేషన్ కార్యదర్శి ఉప్పలపాటి వెంకటేశ్వరరాజు, సంగీత ధ్యానాలయం డాక్టర్ పిప్పల ప్రసాద్, దివ్య సందేశ్ సంస్థ ఎమ్‌డి సరోజినీ, డిఎన్ఆర్ కాలేజ్ ఫైన్‌ఆర్ట్స్ అసోసియేషన్ ఐవిఎస్.శిరీష, ఆర్టిస్ట్ కె.ఇందిర పాల్గొన్నారు.

బీచ్ ఫెస్టివల్‌కు ప్రణాళిక సిద్ధం చేయాలి

ప్రజాశక్తి - భీమవరం

పేరుపాలెం బీచ్ ఫెస్టివల్‌కు ముందస్తు ప్రణాళికను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. బుధవారం కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ పి.ప్రశాంతి టూరిజం, రెవెన్యూ శాఖల అధికారులతో సమావేశమై బీచ్ ఫెస్టివల్ నిర్వహణపై సమీక్షించారు. జిల్లాలో పర్యాటకం అభివృద్ధిలో భాగంగా బీచ్ ఫెస్టివల్ నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లను ప్రణాళికబద్ధంగా పూర్తిచేయాలన్నారు. 2024 జనవరి మూడోవారంలో బీచ్ ఫెస్టివల్ నిర్వహణకు తేదీలను ఖరారు చేయాలని సూచించారు. ఫుడ్ స్టాల్స్, డ్వాక్రా, లేసు ఉత్పత్తులు, పగటిపూట బీచ్ గేమ్స్, గాలిపటాల పోటీలు, ఫైర్ వర్క్స్, సంగీత విభావరి, తదితర వినోదాత్మక కార్యక్రమాలు నిర్వహించేలా షెడ్యూల్‌ను రూపొందించాలన్నారు.

ఈ సమావేశంలో టూరిజం రీజనల్ డైరెక్టర్ వి.స్వామినాయుడు, టూరిజం డిఇ సత్యనారాయణ, జిల్లా టూరిజం అధికారి ఎస్.పట్టాభిరామ్, మొగల్తూరు తహశీల్దార్ జి.అనితకుమారి, ఇఒపిఆర్‌డి ఎం.నవీన్, ఆర్అండ్‌బి అధికారి లోకేశ్వరరావు పాల్గొన్నారు.

పారదర్శకంగా జగన్ పాలన : గ్రంథి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

రాష్ట్రంలో ప్రజలకు నీతివంతమైన పాలన అందిస్తున్నామని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ గ్రంథి శ్రీనివాస్ అన్నారు. బుధవారం పట్టణంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. ముందుగా రూ.19 లక్షల 40 వేలతో 18వ వార్డులోని కామాక్షమ్మ గుడి రోడ్డు శ్రీనివాస సెంటర్ నుండి మున్సిపల్ కాంప్లెక్స్ వరకూ నూతనంగా నిర్మాణం చేసిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. అనంతరం పట్టణంలోని 21వ వార్డులో రూ.21 లక్షల నిధులతో నిర్మించే కోస్టల్ బ్యాంకు నుండి గవర్నమెంట్ హాస్పిటల్ ఫుట్ బ్రిడ్జ్ వరకూ సిసి డ్రెయిన్, ఆర్‌సిసి కల్వర్ట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం రూ.20 లక్షల 50 వేలతో నూతనంగా నిర్మించిన త్యాగరాజు భవనం సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల సొమ్మును నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి జమ చేయడంతో పాటుగా నాన్ డీబిటి కింద కూడా సంక్షేమ పథకాలను అమలు చేయడం జరిగిందన్నారు. సిఎం జగన్ ఆధ్వర్యంలో రాష్ట్రం అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఎం.శ్యామల, కోడే యుగంధర్ విజయలక్ష్మి, తోట భోగయ్య, రాజు, కందికట్ల ఎడ్వర్డ్, గంటా సుందర్ కుమార్, నందమూరి ఆంజనేయులు, పాలపర్తి జోనా, మానేపల్లి నాగన్న బాబు, పేరిచర్ల సత్యనారాయణ రాజు పాల్గొన్నారు.

మంచి ఆహారపు అలవాట్లనూ వివరించాలి : ఆర్‌డిఒ

ప్రజాశక్తి - పాలకోడేరు

ఆరోగ్య సురక్షలో వైద్య పరీక్షలే కాకుండా మంచి ఆహారపు అలవాట్ల గురించి కూడా వివరించాలని భీమవరం ఆర్‌డిఒ కె.శ్రీనివాసులురాజు సూచించారు. పెన్నాడలో సర్పంచి చిల్లా అనూష సత్యనారాయణ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన అర్యోగ సురక్ష కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో మాట్లాడారు. ఎంపిడిఒ మురళీ గంగాధర్‌రావును పరీక్షలకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ మెరుగైన వైద్యం అందించేలా సురక్ష కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. వైద్య శిబిరానికి వచ్చే వారికి వైద్య పరీక్షలను జాగ్రత్తగా నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందించాలన్నారు. అవసరమైన వారికి స్పెషలిస్ట్ వైద్యులచే సేవలందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి చిల్ల అనూష సత్యనారాయణ, తహశీల్దార్ షేక్ హుస్సేన్, పంచాయతీ కార్యదర్శి కె.లక్ష్మి, ఆర్ఐ నాగభూషణరావు, పిహెచ్‌సి వైద్యాధికారి రంగం నాయుడు, పంచాయతీ కార్యదర్శి కె.లక్ష్మి, వైస్ఎంపిపి ఆదాడ లక్ష్మీ తులసి, వార్డు సభ్యులు ఉమామహేశ్వరి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సురక్ష కార్యక్రమనికి విచ్చేసిన ఆర్‌డిఒకు పుష్పగుచ్ఛం అందిస్తున్న పంచాయతీ కార్యదర్శి లక్ష్మి

భర్తను హతమార్చిన భార్య

మద్యం తాగి వేధిస్తున్నాడని ఘాతుకం - భీమవరంలో ఘటన

ప్రజాశక్తి - భీమవరం రూరల్

భర్త నిత్యం మద్యం తాగి వేధిస్తున్నాడనే కారణంతో పీక నులిమి భార్య హత్యచేసిన ఘటన భీమవరంలో బుధవారం చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి వన్ టౌన్ సిఐ అడబాల శ్రీనివాస్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పాలకొల్లు మండలానికి చెందిన ఏలూరి వెంకటేశ్వరరావు(60), భార్య వెంకటలక్ష్మి దంపతులు ఉపాధి నిమిత్తం భీమవరం వచ్చారు. వెంకటేశ్వరరావు స్థానిక రెస్ట్‌హౌస్ రోడ్ గ్రంథం అపార్ట్‌మెంట్ వద్ద గత కొంత కాలంగా వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. వెంకటేశ్వరరావు నిత్యం మద్యం తాగి భార్యతో గొడవపడుతున్నాడు. ఎప్పటిలాగానే బుధవారం మరోసారి గొడవ జరిగింది. దీంతో విసుగుచెందిన ఆమె ఆవేశంలో వెంకటేశ్వరరావు పీక నులిమి హత్యచేసింది. వెంటనే ఆమె వన్ టౌన్ పోలీసులకు లొంగిపోయింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.



27న సాధికారత బస్సుయాత్రను విజయవంతం చేయాలి

నరసాపురం : నరసాపురం నియోజకవర్గంలో ఈ నెల 27వ తేదీన జరిగే సాధికారత బస్సు యాత్రను విజయవంతం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్, ఎంఎల్ఎ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. బుధవారం నరసాపురం 29వ వార్డులోని ఆయన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ప్రసాదరాజు మాట్లాడారు. శుక్రవారం మధ్యాహ్నం మొగల్తూరు లక్ష్మి వెంకటేశ్వర కళ్యాణ మండపం నుంచి, రామన్నపాలెం, ఎల్‌బిచర్ల, లక్ష్మణేశ్వరం మీదుగా నరసాపురం పట్టణం వరకూ బస్సు యాత్రను నిర్వహిస్తామఅన్నారు. సాయంత్రం ఐదు గంటలకు నరసాపురం మెయిన్ రోడ్డులో బహిరంగ సభను ఏర్పాటు చేశామన్నారు. శాసన మండలి ఛైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, పార్లమెంట్ సభ్యులు మోపిదేవి వెంకటరమణ, పిల్లి సుభాష్ చంద్రబోస్, మంత్రులు, ఎంఎల్‌ఎలు పాల్గొంటారని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఛైర్‌పర్సన్ బర్రి వెంకటరమణ, జయరాజు, జెడ్‌పిటిసి సభ్యులు తిరుమాని బాపూజీ, మాజీ జెడ్‌పిటిసి సభ్యులు చాగంటి సత్యనారాయణ, నాయకులు బర్రె శంకర్, పప్పుల రామారావు, భుసారపు జయప్రకాష్, కడలి రాంబాబు, పాల్గొన్నారు.

వైఎన్ కళాశాల ప్రిన్సిపల్ కనకారావు

ప్రజాశక్తి - నరసాపురం

స్థానిక వైఎన్ కళాశాల ప్రిన్సిపల్‌గా డాక్టర్ చింతపల్లి కనకారావును నియమిస్తూ కళాశాల సెక్రెటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ చినమిల్లి సత్యనారాయణరావు ఉత్తర్వులు జారీ చేశారు. బుధవారం ఆయన బాధ్యతలు చేపట్టారు. గతంలో కనకారావు కళాశాలలో వైస్ ప్రిన్సిపల్‌గాను, స్టూడెంట్ అడ్వైజర్‌గా, స్టూడెంట్ మేనేజర్ హాస్టల్ వార్డెన్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా కనకరావు మాట్లాడుతూ కళాశాలలో అందరూ సహకరించాలని, విద్యార్థులను క్రమశిక్షణలో నిలిపి, చదువులో ముందుండేలా, వారికి హెచ్‌ఆర్‌డి కేంద్రం ద్వారా ఉద్యోగ అవకాశాలు కలిగేలా చర్యలు చేపడతానన్నారు. కళాశాల వైస్ ప్రెసిడెంట్ పొన్నపల్లి రామారావు, వైఎన్ డైమండ్ జూబ్లీ జూనియర్ కళాశాల సెక్రెటరీ అండ్ రామసతీష్, గవర్నింగ్ బాడీసభ్యులు చేగొండి సత్యనారాయణమూర్తి, పీజీ డైరెక్టర్ నిమ్మల చింతారావు, కళాశాల డీన్ గంధం రామకృష్ణ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది కనకారావును అభినందించారు.

ప్రజాశక్తి వార్తకు అధికారుల వివరణ

ప్రజాశక్తి - వీరవాసరం

ఈనెల 22న ప్రజాశక్తిలో ప్రచురితమైన 'ఎంఎల్‌ఎ వచ్చారు.. వైద్యులేరి..!' శీర్షికన వచ్చిన వార్తకు జిల్లా ఆరోగ్య శాఖ జిల్లా అధికారి మహేశ్వరరావు వివరణ ఇచ్చారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రయివేటు వైద్యులు ఆలస్యంగా రావడంతో జిల్లా వైద్యాధికారి వీరవాసరం పిహెచ్‌సి వైద్యాధికారి సత్యనారాయణరాజు వివరణ కోరారు. ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ప్రయివేటు వైద్యులు సకాలంలో హాజరుకాలేదని తెలిపారు. ప్రయివేటు వైద్యులు వారి ఆసుపత్రిలో అత్యవసర వైద్యం అందించాల్సి రావడంతో ఈ కార్యక్రమానికి ఆలస్యంగా వచ్చారని తెలిపారు.

ముగిసిన దసరా ఉత్సవాలు

ప్రజాశక్తి - ఆచంట

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు బుధవారంతో ఘనంగా ముగిశాయి. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయాల్లో యాత్రికులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆచంట రామేశ్వరస్వామి సన్నిధిలో కొలువైన పార్వతి అమ్మవారు రాజేశ్వరి దేవి అలంకరణలో యాత్రికులకు దర్శనమిచ్చారు. దసరా సందర్భంగా పెదనాలంలో వైభవంగా మాసేనమ్మ గ్రామోత్సవం నిర్వహించారు. అనంతరం గోదావరి నదిపై అమ్మవారి తెప్పోత్సవం నిర్వహించారు. కొడమంచిలిలో అమ్మవారి ఊరేగింపు సందర్భంగా మహిళలు కలశాలతో ప్రదర్శన నిర్వహించారు. గోదావరి జలాలతో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు. ఆచంట, కొడమంచిలి, పెదమల్లం, కోడేరు, కరుగోరుమిల్లి, వల్లూరు, పెనుమంచిలి, ఆచంట వేమవరం తదితర గ్రామాల్లో దసరా ఉత్సవాలు వైభవంగా జరిగాయి. మేళతాళాలతో బాణాచాంచా కాల్పులు, నృత్యాలతో గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా పలుచోట్ల అన్న సమాధానాలు నిర్వహించారు.

పెనుమంట్ర: దసరా సందర్భంగా నెగ్గిపూడి వనవులమ్మ, కనకదుర్గమ్మను ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు బుధవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెలగలేరు సొసైటీ అధ్యక్షులు అల్లం భాస్కరరెడ్డి, సత్యశ్రీ రామిరెడ్డి, విష్ణుకుమార్‌రెడ్డి, బాలాజీరెడ్డి, ఉపసర్పంచ్ అల్లం బాలసాయిరెడ్డి, పాల సత్తి రామిరెడ్డి, సత్తి విష్ణుకుమార్ రెడ్డి, వెలగల బాలాజీ రెడ్డి, కీర్తి కనకయ్య, కంబాల కుమార్, సత్తి పరమేశ్వర్ రెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు



అనందపురంలో ఇంటింటికీ టిడిపి కార్యక్రమంలో ఎంఎల్ఎ మంతెన రామరాజు

టిడిపిని అధికారంలోకి తీసుకురావాలి

ప్రజాశక్తి - కాళ్ల

రాష్ట్ర అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని, 2024 సార్వత్రిక ఎన్నికల్లో పార్టీని అధికారంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని ఉండి ఎంఎల్ఎ మంతెన రామరాజు అన్నారు. అనందపురం, మేకలదిబ్బ గ్రామాల్లో ఇంటింటికీ తెలుగుదేశం, మన రాంబాబు, భవిష్యత్తుకు గ్యారంటీ వంటి కార్యక్రమాలతో పాటు బాబుతో నేను కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. చంద్రబాబును అరెస్టు చేసి 47 రోజులవుతున్నప్పటికీ బెయిల్ రాకపోవడం పట్ల రామరాజు ఆవేదన వ్యకం చేశారు. ఇంటింటికి వెళ్లి సమస్యలను తెలుసుకోవడంతో పాటు మినీ మేనిఫెస్టోలోని పథకాల వివరాలున్న కరపత్రాలను, చంద్రబాబు అరెస్టు నేపథ్య వివరాలున్న కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జివి.నాగేశ్వరరావు, వీరవల్లి శ్రీనివాస్, ఉద్దరాజు శ్రీనివాసరాజు, అల్లూరి దొరయ్యచౌదరి, బర్రె ఏడుకొండలు, తిరుమాని పట్రాజు, మంతెన సుబ్బరాజు, పుప్పాల బుజ్జి, దాసరి రాజు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఫిల్టర్ బెడ్‌కు మరమ్మతులు చేస్తున్న కార్మికులు

రూ.పది లక్షలతో ఫిల్టర్ బెడ్లకు మరమ్మతులు

ప్రజాశక్తి - కాళ్ల

పెదఅమిరంలో ప్రజలందరికీ సురక్షిత తాగునీరు అందించడానికి కృషి చేస్తున్నామని సర్పంచి డొక్కు సోమేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారానికి యుద్ధ ప్రాతిపదికన ఫిల్టర్ బెడ్లలో పాత ఇసుక తీసి కొత్త ఇసుక ఏర్పాటు చేస్తున్నామన్నారు. రూ.10లక్షలతో ఫిల్టర్ బెడ్లలో ఇసుక మార్పిడి పనులు చేపట్టామన్నారు. రోడ్డుకు ఇరువైపులా చెత్త, మట్టి తొలగించే పనులు చేశామన్నారు. కొత్త వీధిలైట్లు, కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు చేశామన్నారు. కోటి రూపాయలతో ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్ నరసింహారాజు ఆధ్వర్యంలో పెదఆమిరం గ్రామాభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు.

ఎపిటిఎఫ్ ధర్నాను విజయవంతం చేయాలి

భీమవరం: ఈనెల 29న నిర్వహించనున్న ఎపిటిఎఫ్-1938 ధర్నాను విజయవంతం చేయాలని జిల్లా కన్వీనర్ రమణ పిలుపునిచ్చారు. భీమవరంలో రాష్ట్రస్థాయి ధర్నాకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడారు. గ్యారంటీ పెన్షన్ స్కీం రద్దు చేసి పాత పెన్షన్ స్కీం పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల ఆర్థిక బకాయిలను చెల్లించాలని కోరారు. ప్రాథమిక విద్యను నిర్వీర్యం చేసే జిఒ 117ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎస్ జిల్లా కన్వీనర్ శ్రీవల్లి, జిల్లా కార్యవర్గ సభ్యురాలు తిరుమల్లేశ్వరి, నరసాపురం డివిజన్ కన్వీనర్ నాగరాజు పాల్గొన్నారు.

ఫర్నీచర్ షాప్ ప్రారంభం

భీమవరం రూరల్: స్థానిక మెంటేవారితోటలో ఏర్పాటు చేసిన జయవర్ధన్ ఫర్నీచర్ షాపును ఎంఎల్ఎ, విప్ గ్రంధి శ్రీనివాస్ బుధవారం ప్రారంభించారు. ఈ షాప్ గతంలో జరిగిన విద్యుదాఘాతంలో పూర్తిగా దగ్ధమైంది. కష్టకాలంలో ఉన్న షాపు యజమాని జయవర్ధన్ ఎంఎల్ఎ అండతో మళ్లీ ఫర్నీచర్ షాప్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. ఈ కార్యక్రమంలో షాపు యజమాని ఉంగరాల రాజు, తోట భోగయ్య, మానేపల్లి నాగన్న బాబు, పాలవెల్లి మంగ, రామిశెట్టి జయసూర్య, ముత్యాల అంజి, కోయ మణికంఠ, ముత్యాల బోసు, సుబ్బారావు పాల్గొన్నారు.

ఆక్వా మందుల మాఫియాను అరికట్టాలి

ప్రజాశక్తి - వీరవాసరం

రొయ్యల సాగులో రైతులు ఎదుర్కొంటున్న మందుల కంపెనీల మాఫియాను అరికట్టాలని మండల రొయ్యల రైతుల సంక్షేమ సంఘం ప్రభుత్వానికి డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం వీరవాసరంలో విలేకర్ల సమావేశం సంఘం సభ్యులు ఏర్పాటు చేశారు. ప్రతిరంగంపైనా ప్రభుత్వ పర్యవేక్షణ ఉందని, కానీ రొయ్యల సాగుకు వినియోగించే మందులపై లేకపోవడంతో కంపెనీలు ఇష్టానుసారంగా ధరలు ముద్రించుకుని అమ్మకాలు సాగిస్తున్నాయని ఆరోపించారు. దీంతో రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. మందుల డబ్బాలపై ముద్రించిన రేటును ఒక్కో రైతుకు ఒక్కో విధంగా అమ్ముతున్నారన్నారు. దీంతో వాస్తవరేటు ఎంతో తెలియడం లేదన్నారు. మందులలో నాణ్యతలో కూడా నమ్మకం లేదన్నారు. కంపెనీలు నిర్దిష్టమైన లాభంతో మందుల రేటును నిర్ణయించేలా ప్రభుత్వం నియంత్రణ చర్యలు తీసుకోవాలన్నారు. వీరవాసరం మండలంలో కొంత మంది రొయ్యల సాగుపై ఉద్దేశపూర్వకంగా ఫిర్యాదులు చేస్తున్నారన్నారు. ఇలాంటి ఫిర్యాదుల పట్ల ప్రభుత్వ అధికారులు వాస్తవాలను పరిశీలించాలని, తొందరపాటు చర్యలు తీసుకోకూడదని విజ్ఞప్తి చేశారు. ఆక్వా జోన్‌లో లేని పది ఎకరాల సాగు రైతులకు కూడా విద్యుత్ రాయితీ ఇవ్వాలన్నారు. విద్యుత్ కోతల నుండి రొయ్యల సాగు రైతులకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. ఆక్వా రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాజు మాట్లాడుతూ వ్యవసాయానికి అనుగుణంగా లేని భూముల్లో ఆక్వాసాగుకు అనుమతులివ్వాలని కోరారు. ప్రభుత్వానికి ఆక్వాసాగు రైతులకు మధ్య ఎపి స్టేట్ ఆక్వా కల్చర్ డెవలప్‌మెంట్ అథారిటీ(అప్సడ) కో వైస్ ఛైర్మన్ వడ్డి రఘురాం కృషి వల్ల రొయ్య రైతుల సమస్యలు పరిష్కారమవుతున్నాయన్నారు. గతం కంటే ప్రస్తుతం రైతులు ఎదుర్కొంటున్న గిట్టుబాటు ధర, మేతల ధరలు, ఆక్వా జోన్‌ల మార్కింగ్, విద్యుత్ సబ్సిడీ వంటి సమస్యలను సిఎం జగన్ దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించడంలో అప్సడ కృషి బాగుందన్నారు. ఈ కార్యక్రమంలో రొయ్య రైతుల సంక్షేమ సంఘం నాయకులు మళ్ల రాంబాబు, భోగిరెడ్డి శ్రీనివాసరావు, గుండా నరసింహారావు, పంజా వెంకటేశ్వరావు, సుబ్రహ్మణ్యం, కాయల మనోహరరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుబ్బరాజు

రంగరాజు కార్టూన్‌కు రాష్ట్రస్థాయి బహుమతి

ప్రజాశక్తి - ఉండి

చెరుకువాడకు చెందిన కవి, రచయిత, కార్టూనిస్ట్, రిటైర్డ్ ఉపాధ్యాయులు గాదిరాజు రంగరాజు కార్టూన్‌కు రాష్ట్రస్థాయి బహుమతి లభించింది. ప్రముఖ సాహితీవేత్త మామిడిపూడి రామకృష్ణయ్య స్మారక రాష్ట్ర స్థాయి కార్టూన్ పోటీల్లో రంగరాజు గీసిన కార్టూన్ నగదు బహుమతి గెలుచుకుంది. ఈనెల 29న నెల్లూరు టౌన్ హాలులో జరిగే బహుమతి ప్రధానోత్సవంలో బహుమతి అందుకోనున్నట్లు ఆయన తెలిపారు. వెయ్యి రూపాయలు నగదు బహుమతితో పాటు సత్కారిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రత్యేక కార్టూన్ సంకలనం విడుదల చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ శాఖా మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి, 24 కళలు అధ్యక్షులు అమరావతి కృష్ణా రెడ్డి, ప్రముఖ సాహితీవేత్త, మాజీ ఐఎఎస్ అధికారి వాడ్రేవు చిన వీరభద్రుడు, వంటి ప్రముఖుల ద్వారా బహుమతి అందిస్తున్నట్లు విశాలాక్షి పత్రికా సంపాదకులు ఈతకోట సుబ్బారావు తెలిపారన్నారు. ఈ మేరకు ఆహ్వానం తనకు అందిందన్నారు.



మాట్లాడుతున్న సిఐ శ్రీనివాస్

ప్రతిపౌరుడూ బాధ్యతగా ఉండాలి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రతిపౌరుడూ ఒక పోలీసులా బాధ్యతగా ఉన్నప్పుడే శాంతిభద్రతలు పరిరక్షించుకోగలమని డిఎన్ఆర్ కళాశాల వైస్ ప్రెసిడెంట్ గోకరాజు పాండురంగరాజు అన్నారు. శ్రీవిజ్ఞానవేదిక, భీమవరం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో డిఎన్ఆర్ కళాశాలలో పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను బుధవారం నిర్వహించారు. రెండో పట్టణ సిఐ జి.శ్రీనివాస్ మాట్లాడుతూ ఆపద సమయంలో వెనకడుగు వేయకుండా ప్రజల పక్షాన పోరాటం చేస్తున్నవారు పోలీసులేనన్నారు. అనంతరం 'మహిళలపై అత్యాచారాలు, లైంగిక వేధింపులు' అనే అంశంపై విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ శాంత కుమారి, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ అనిల్ దేవ్, ఎఒ రామకృష్ణంరాజు పాల్గొన్నారు.



సాయం అందిస్తున్న శేషుబాబు

రోగులకు వసుధ ఫౌండేషన్ ఆర్థికసాయం

ప్రజాశక్తి - పాలకొల్లు

అనారోగ్యంతో బాధపడుతున్న ముగ్గురు రోగులకు వసుధ ఫౌండేషన్ రూ.10 వేలు చొప్పున రూ.30 వేలను బాధిత కుటుంబాలకు బుధవారం అందించారు. జిన్నూరుపాలేనికి చెందిన కె.వంశీ(18) వెన్నెముక దెబ్బతిని మంచానికి పరిమితమై బాధపడుతున్నాడు. అలాగే చింతపర్రుకి చెందిన పాలపర్తి బుద్దేశ్వరరావు పెరాలసిస్‌తో, దర్భరేవుకు చెందిన కల్లేపల్లి సుబ్బలక్ష్మి(65) హార్ట్, కిడ్నీ, నరాల బలహీనతతో బాధపడుతున్నారు. వీరికి చెక్కులను వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకట రామరాజు పంపారు. టిటిడి పాలక మండలి సభ్యులు మేకా శేషుబాబు ద్వారా అందించారు. శేషుబాబు మాట్లాడుతూ వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ వెంకట రామరాజు ఇలాంటి ఎంతోమంది పేదవాళ్లను ఆదుకుంటూ, పేద విద్యార్థులకు ఫీజులు కడుతూ అనేక పాఠశాలలకు వాటర్ ఫిల్టర్లు ఇచ్చి ఎన్నో సేవా కార్యక్రమాలను తెలుగు రాష్ట్రాల్లో చేయడం గర్వించదగ్గ విషయమన్నారు. ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు సేవలను శేషుబాబు కొనియాడారు. ఈ కార్యక్రమంలో పలువురు పెద్దలు పాల్గొన్నారు

జగన్‌కు 25 సీట్లు రావడమే కష్టం : నిమ్మల

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో జగన్ ప్రభుత్వానికి 25 సీట్లు కూడా దక్కవని ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు అన్నారు. ఆయన తన కార్యాలయంలో బుధవారం మీడియాతో మాట్లాడారు. ఓటమి భయంతోనే చంద్రబాబును అక్రమంగా అరెస్టు చేశారన్నారు. మహిళలు ఆర్థికాభివృద్ధి, సంక్షేమం కోసమే డ్వాక్రా సంఘాలను చంద్రబాబు ఏర్పాటు చేశారన్నారు.

ఎపిడబ్ల్యూజెఎఫ్ భీమవరం నియోజకవర్గ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - భీమవరం

ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ భీమవరం నియోజకవర్గ నూతన కమిటీని ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో బుధవారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా గుండా రామకృష్ణ, అధ్యక్షులుగా వేగిరాజు రాధాకృష్ణంరాజు, ఉపాధ్యక్షులుగా సూర్య, ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా గూడూరి నాగరాజు, సహాయ కార్యదర్శిగా బహ్మేంద్ర, కోశాధికారిగా కేతా సత్యనారాయణ, కన్వీనర్‌గా ధనరాజ్ (నాని), సభ్యులుగా శ్రీనివాస్‌రాజు, ఆదిత్య బాబి, బి.శివవర్మ, కేశిరెడ్డి తేజారావు, లాల్ రావు, జిల్లా న్యాయ సలహాదారుడు నక్క శివకుమార్‌ను ఎన్నుకున్నారు.

వైసిపి పాలన అప్రజాస్వామికం : టిడిపి

ప్రజాశక్తి - ఆచంట

అప్రజస్వామిక, దుర్మార్గ పాలన వైసిపి ప్రభుత్వం కొనసాగిస్తుందని మాజీమంత్రి పితాని సత్యనారాయణ అన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా ఆచంటలో టిడిపి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రిలే నిరాహార దీక్షలు బుధవారానికి 43వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా సైకో పోవాలి సైకిల్ రావా', చంద్రబాబును విడుదల చేయాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా దీక్షలో కూర్చున్న వారికి పితాని సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మొదటి నుంచి దుర్మార్గమైన ఆలోచనలతో పరిపాలన కొనసాగిస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నేతలు గుబ్బల మాధవరావు, కండిబోయిన శ్రీనివాస్, కట్టా బాలాజీ పవన్ కుమార్, రాజేష్, మురళీ, అచ్యుతరావు, లక్ష్మణరావు, ఆనందరావు, కేతా మురళీ, వెంకటరమణ, మోహన్ పాల్గొన్నారు.



దీక్షలో పాల్గొన్న పితాని సత్యనారాయణ

మొగల్తూరు : చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టడం దారుణమని టిడిపి నాయకులు విమర్శించారు. మండలంలోని ముత్యాలపల్లిలో బుధవారం టిడిపి నాయకులు నిజం గెలవాలి అంటూ ప్లకార్డులతో నిరసన ప్రదర్శన చేపట్టారు. చంద్రబాబు సతీమణి భువనేశ్వరి చేపట్టిన నిజం గెలవాలి బస్సుయాత్ర విజయవంతం కావాలని నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగిడి రాంబాబు, ఏడుకొండలు, దొంగ శ్రీను, పెద్దసింగ్ భాస్కరరావు, కొల్లాటి సాయిబాబా, కోప్పనాతి జనక మహారాజు, కొల్లాటి కోటేశ్వరరావు, పెద్దసింగ నాగేశ్వరరావు, కొల్లాటి పెంటయ్య, మూలాస్వామి, బందన విజయ్‌కుమార్, తిరుమని సాయిబాబా ఉన్నారు.

పాలకొల్లు : చంద్రబాబు అరెస్టుకు నిరసనగా పాలకొల్లు గాంధీ బొమ్మ సెంటర్ వద్ద టిడిపి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రిలే నిరాహారదీక్షలు బుధవారానికి 43వ రోజుకు చేరాయి. ఈ రోజు దీక్షలో 18, 20, 25 వార్డులకు చెందిన టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. వీరికి ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, పెచ్చెట్టి బాబు సంఘీభావం తెలిపారు.

ప్రజల వద్దకే ఉచితంగా మెరుగైన వైద్యం

ప్రజాశక్తి - ఆచంట

ఆరోగ్య సురక్ష ద్వారా ఎంతోమంది పేద ప్రజలకు ఉచితంగా మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని ఎంపిపి దిగమర్తి సూర్యకుమారి తెలిపారు. బుధవారం కరుగోరుమిల్లి ఉన్నత పాఠశాలలో సర్పంచి అల్లం పద్మావతి అధ్యక్షతన ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ చిల్లే లావణ్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి బోడపాటి బుల్లయ్య, నేతలు సల్లాది రంగారావు, నాగేశ్వరరావు, ఎంపిడిఒ నరసింహ ప్రసాద్, ఇఒపిఆర్‌డి మూర్తిబాబు, కార్యదర్శి పద్మారావు పాల్గొన్నారు.



ఆచంటలో కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఉండి: పేదలకు ఉచితంగా మెరుగైన వైద్యసేవలను ఇంటివద్దకే తీసుకెళ్లడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని అర్తమూరు ఎంపిటిసి దంగేటి రామలింగేశ్వరరావు అన్నారు. బుధవారం అర్తమూరులో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో రామలింగేశ్వరరావు మాట్లాడుతూ ఆరోగ్య సురక్ష ద్వారా ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం అందిస్తున్నామన్నారు. అనంతరం అవసరమైన వారికి ఉచితంగా పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెసిఎస్ మండల కన్వీనర్ బులుసు వెంకట రామకృష్ణ, నాయకులు వెంకటేశ్వరరావు, వజ్రం, అధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మొగల్తూరు : సిఎం జగన్ రాష్ట్రంలో విప్లవాత్మక పాలన అందిస్తున్నారని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. కాళీపట్నంతూర్పులో బుధవారం ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆరోగ్య సురక్షకు శ్రీకారం చుట్టి పేదలకు వైద్య సేవలను జగన్ అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మేడిది సౌజన్య ప్రభాకర్, జెడ్‌పిటిసి సభ్యులు టి.బాపూజీ, ఎంపిటిసి సభ్యులు టి.వెంకటలక్ష్మి, ప్రజా ప్రతినిధులు చల్లా రమేష్, టి.వెంకన్న, కవురు పెద్దిరాజు, జి.జయరాజు, నేతల దాసు, దాసు, బొక్క అంజి, గుబ్బల సత్యనారాయణ, నాగమోహన్, నాగేశ్వరరావు, పాల్గొన్నారు.

నరసాపురం టౌన్ : జగనన్న ఆరోగ్య సురక్ష పేదలకు వరం వంటిదని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. మండలంలో సారవ గ్రామ సచివాలయం వద్ద జరిగిన ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంపును బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, జెడ్‌పిటిసి సభ్యులు బొక్క రాధాకృష్ణ, వైస్ ఎంపిపి ఉంగరాల రమేష్ నాయుడు పాల్గొన్నారు.

ఇళ్లు కోల్పోయిన వారికి న్యాయం చేయాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - ఉండి

పెదకాపవరం - పాములపర్రు రహదారి విస్తరణలో భాగంగా ఇళ్లు కోల్పోయే బాధితులకు తగిన న్యాయం చేయాలని ఎంఎల్ఎ రామరాజు అధికారులను కోరారు. బుధవారం పాములపర్రులో పర్యటించిన ఎంఎల్ఎ రామరాజుకు బాధితులు పలుసమస్యలను వివరించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ ఏడిద శ్రీనివాస్‌తో ఎంఎల్ఎ మాట్లాడుతూ 50 ఏళ్ల నుంచి పాములపర్రులో ఇల్లులేని నిరుపేదలు నివాసాలు ఏర్పాటు చేసుకుని జీవిస్తున్నారని, రహదారి విస్తరణ పేరుతో వారిని ఖాళీ చేయించడం తగదన్నారు. బాధితులకు ఇంటి స్థలాలను కేటాయించిన తర్వాతే వారిని ఖాళీ చేయించాలని అధికారులను ఆదేశించారు. బాధితులకు తగిన న్యాయం చేయకపోతే సిపిఎం, సిపిఐ, జనసేన పార్టీల నాయకులతో గ్రామస్తులతో కలిసి ఉద్యమిస్తామని అధికారులను హెచ్చరించారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ డ్రెయినేజీ పోరంబోకు భూముల్లో చాలామంది ఇంటి నిర్మాణాలు చేపట్టి నివాసాలు ఏర్పాటు చేసుకున్నారని, వారిలో చాలామందికి వేరేచోట ఇంటి స్థలాలున్నాయని ఎంఎలఎకు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలను నిర్వర్తించడం తమ బాధ్యత అని వారు తెలిపారు. పాములపర్రులో పర్యటించి బాధితులను పరామర్శించిన వారిలో ఎంపిటిసి యడవల్లి వెంకటేశ్వర రావు, టిడిపి నాయకులు జుత్తిగ శ్రీనివాస్, మంతెన సాయిలచ్చిరాజు, కేసన కోటి, లోకం సుబ్బారావు, కోమటి నరేంద్ర, జనసేన నాయకులు, సిపిఐ నాయకులు ఉన్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎంఎల్ఎ రామరాజు

ప్రమాదకరంగా పెనుగొండ వంతెన

ప్రజాశక్తి - పెనుగొండ

పెనుగొండ ఓవర్ బ్రిడ్జి ప్రమాదకరంగా మారింది. బ్రిడ్జి రోడ్డుపై అడుగడుగునా భారీ గోతులు పడి ఐరన్ రాడ్లు పైకి కనిపిస్తున్నాయి. దీంతో ప్రజలు బిక్కుబిక్కుమంటూ ప్రయాణించాల్సి వస్తోంది. తరచూ ఈ భారీగోతుల్లో పడి ప్రయాణికులు గాయాలపాలవుతున్నారు. నిత్యం వందలాది భారీ వాహనాలు వంతెనపై రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో ఏ క్షణాన ఏ ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులు కనీసం స్పందించడం లేదు. మరమ్మతులు కూడా చేయడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వంతెన రోడ్డు నిర్మించి దాదాపు మూడేళ్లు కావొస్తుంది. ప్రస్తుతం ఈ రోడ్డుపై భారీ గోతులు ఏర్పడి రాకపోకలకు ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాలని ప్రయాణికులు, వాహనదారులు కోరుతున్నారు.



ప్రమాదకరంగా ఉన్న వంతెన

యాంటీనాలపై పరిశోధనలకు నాగవల్లికి పిహెచ్‌డి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

ప్రకృతి సహజ సిద్ధమైన మెట హ్యూరిస్టిక్ టెక్నిక్స్ ఉపయోగించి అల్గరిథం ద్వారా యాంటినా రూపొందిస్తే 5జి అప్లికేషన్స్‌కు ఎంతగానో అనువుగా ఉంటుందని ఎస్ఆర్‌కెఆర్ ఇంజినీరింగ్ కళాశాల ఇసిఇ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ వేగేశ్న నాగవల్లి చేసిన పరిశోధనకు అన్నమలై విశ్వవిద్యాలయం ఇసిఇ విభాగంలో పిహెచ్‌డి ప్రదానం చేసిందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కెవి.మురళీకృష్ణంరాజు తెలిపారు. ఈ సందర్భంగా నాగవల్లిని కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిషాంత వర్మ యాజమాన్యం తరపున ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ జగపతిరాజు మాట్లాడుతూ కళాశాలలో యువ అధ్యాపకులు పెద్ద సంఖ్యలో పిహెచ్‌డిలు చేయడం అభినందనీయమన్నారు. నూతన టెక్నాలజీకి అనుగుణంగా వస్తున్న మార్పులతో సొసైటీకి మరింతగా ఉపయో గపడే విధంగా పరిశోధనలు చేసిన నాగవల్లిని ఆయన అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ నాగవల్లి మాట్లాడుతూ అన్నమలై విశ్వవిద్యాలయం ఇసిఇ విభాగం ప్రొఫెసర్ యమునా, విష్ణు మహిళా ఇంజనీరింగ్ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ టి.సుధీర్‌కుమార్ పర్యవేక్షణలో తాను జరిపిన పరిశోధనలకు గాను యూనివర్సిటీ పిహెచ్‌డి ప్రధానం చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో ఇసిఇ డిపార్ట్‌మెంట్ హెడ్ ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆపన్నులకు అండగా కొవ్వలి ఫౌండేషన్

మొగల్తూరు : ఆపదలో ఉన్నవారికి కొవ్వలి ఫౌండేషన్ అండగా ఉంటుందని నరసాపురం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అన్నారు. లక్కువారితోటకు చెందిన లక్కు వీరన్న ఇల్లు ఇటీవల అగ్ని ప్రమాదంలో కాలిపోయి సర్వం కోల్పోయాడు. దీనిపై కొవ్వలి ఫౌండేషన్ ఛైర్మన్ కొవ్వలి యతిరాజ రామ్మోహన్ నాయుడు స్పందించి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సుమారు రూ.1.20 లక్షలు ఇంటిని నిర్మించారు. పొత్తూరి రామరాజు, రామ్మోహన్ నాయుడు బుధవారం ఇంటిని ప్రారంభించారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడారు. ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటున్న కొవ్వలి యతి రాజా రామ్మోహన్ నాయుడు ఆదర్శనీయుడని కొనియాడారు. భవిష్యత్తులో కొవ్వలి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మరిన్ని సేవా కార్యక్రమాలు విస్తృతం చేయాలని ఆయన కోరారు. రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ పేదలను, ఆపదలో ఉన్న వారిని ఆదుకోవాలనే ఉద్దేశంతో కొవ్వలి ఫౌండేషన్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటివరకూ విద్య, వైద్య, ఉద్యోగ, ఆధ్యాత్మికంగా శక్తివంచన లేకుండా సేవలందించామన్నారు. ప్రతిఒక్కరూ సేవాభావంతో ఉంటూ మరికొంత మందికి సేవలందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి బందెల ఎలీషా, ఫౌండేషన్ ఉపాధ్యక్షురాలు నిమ్మకాయల నీలిమ, టిడిపి మండల అధ్యక్షులు గుబ్బల నాగరాజు, మాజీ ఎంపిపి కత్తిమండ ముత్యాలరావు, మామిడిశెట్టి సత్యనారాయణ, ఆకన కోటి, బొక్కా సత్యనారాయణ, లక్కు శ్రీను, లక్కు పాండు రంగారావు, లక్కు శేషు, ఆకన సుబ్రహ్మణ్యం, కొల్లాటి బాలకృష్ణ, పాలా రాంబాబు, పులపర్తి త్రిమూర్తులు, చాగంటి శ్రీను ఉన్నారు.